క్లుప్తంగా

సైనిక స్కూల్లో సీటు సాధించిన విద్యార్థి



దాచేపల్లి : ఆల్ ఇండియా సైనిక్ స్కూల్లో చిగుళ్ల నిహాల్ ఆర్యన్ సీటు సాధించాడని ఏలియంపేట ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వట్టిపు నాగేశ్వరరావు శుక్రవారం తెలిపారు. ఏలియంపేట ప్రభుత్వ పాఠశాలలో 5వ తరగతి చదువుకుంటున్న నిహాల్ ఆర్యన్ సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష రాసి 300 మార్కులకు గాను 212 మార్కులు సాధించి, సీటు దక్కించుకున్నాడని చెప్పారు. నిహాల్ ఆర్యన్‌ను ఉపాధ్యాయురాలు పద్మావతి తదితరులు అభినందించారు.

గిరిజన ఆశ్రమ పాఠశాల వార్షికోత్సవం



వెల్దుర్తి: శిరిగిరిపాడులోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం వార్షికోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీటీడబ్ల్యూఓ లోతేటి వరలక్ష్మి మాట్లాడారు. విద్యార్థినులు కష్టపడి చదవాలని సూచించారు. పలు పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు వరలక్ష్మి బహుమతులను అందజేశారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో ఎంఈఓ అల్లి సురేష్, పాఠశాల హెచ్‌ఎం పాలకీర్తి పద్మ, వార్డెన్ వై.పోతురాజు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి



మాచర్ల రూరల్: చదువుతోనే ఆర్థికాభివృద్ధి సాధ్యమని బలంగా నమ్మిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ విద్యా ఫలాల వల్ల పేద, మధ్య తరగతి విద్యార్థులు ఉన్నత స్థానంలో నిలుస్తున్నారనడానికి సాఫ్ట్‌వేర్ కంపెనీ హెచ్‌సీఎల్‌లో 42 మంది ఉద్యోగాలు పొందడమే నిదర్శనమని న్యూటన్స్ ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ జున్నా శ్రీనివాసరెడ్డి చెప్పారు. శుక్రవారం మండలంలోని న్యూటన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో 42 మంది విద్యార్థులకు ఉద్యోగాలు వచ్చాయి. విద్యార్థులను శ్రీనివాసరెడ్డి అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జగదీశ్వరరెడ్డి, డీన్ సందీప్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై దాడులను ఖండించాలి

గురజాల : మహిళలపై జరుగుతున్న దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాల్సిన అవసరం ఉందని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు జె.కల్పన పేర్కొన్నారు. అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట వారోత్సవాల్లో భాగంగా స్థానిక నందనం వెంకటరావు నగర్ కాలనీలో మహిళా సదస్సు నిర్వహించారు. కల్పన మాట్లాడుతూ మహిళల హక్కులను వివరించారు. కార్యక్రమంలో శీలం యేసమ్మ, నాయకురాలు నాగలక్ష్మి, జాన్‌బీ, హైమావతి, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎల్ఐసీ అవార్డులు



వినుకొండ(నూజెండ్ల): మండలంలోని నాగులవరం గ్రామంలో ఎల్ఐసీ వారి ఆధ్వర్యంలో జెడ్పీహెచ్ పాఠశాలలో 2021–22 సంవత్సరానికి సంబంధించి స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ అవార్డులను వినుకొండ బ్రాంచి మేనేజర్ లక్ష్మానాయక్ చేతుల మీదుగా ట్రోఫీలు, ప్రశంసా పత్రాలను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నూనె కోటేశ్వరరావు, హెచ్‌ఎం శారద, ఏజెంట్స్ ప్రెసిడెంట్ చెరుకూరి హరనాథ్‌బాబు, మద్దుల రమణారెడ్డి, ఏడుకొండలు, దానపురెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

భారత్ బచావో సదస్సు జయప్రదం చేయండి

నరసరావుపేట రూరల్: కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఈనెల 5వ తేదీన ఆదివారం గుంటూరు సీపీఐ కార్యాలయంలో నిర్వహించే సదస్సును జయప్రదం చేయాలని దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం సీనియర్ సభ్యులు నల్లపాటి రామారావు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. హిందూ మతోన్మాద శక్తుల నుంచి దేశాన్ని కాపాడుకోవాలని, హిందూ మతోన్మాదంతో ప్రజలపై చేస్తున్న దాడులను అరికట్టాలన్నారు. మాట్లాడే హక్కును హరిస్తున్న కేంద్ర ప్రభుత్వం నిరంకుశ వైఖరిని ఎండగట్టాలని పిలుపునిచ్చారు. మేధావులు, ప్రజలు, ఆదివాసీలపై పెట్టిన తప్పుడు కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

భవితకు బంగారుబాట

- తీరిన విద్యార్థుల వెతలు
- పాఠశాలకు రూ.15 లక్షలతో రోడ్డు

గురజాల : పల్లెగుంత మోడల్ స్కూల్ విద్యార్థులకు ఇబ్బందులు తప్పాయి. ఇప్పటివరకు పెద్దపెద్ద రాళ్ల మధ్య ఉన్న పాఠశాలకు వెళ్లేందుకు రహదారి లేక విద్యార్థులు అవస్థలు పడ్డారు. గత ప్రభుత్వ హయాంలో పాఠశాలకు రోడ్డు వేయించాలని కోరినా అప్పటి పాలకులు, అధికారులు పట్టించుకోలేదు. ఎన్నిమార్లు అర్జీలు దాఖలు చేసినా వాటిని బుట్టదాఖలు చేశారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామ సర్పంచ్ వంకాయలపాటి మల్లయ్య ఎంపీపీ కొమ్మినేని నారాయణమ్మ బుజ్జి, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి దృష్టికి సమస్యను తీసుకువెళ్లి నాబార్డు ద్వారా రూ.15 లక్షలు మంజూరు చేయించి సీసీ రోడ్డు నిర్మాణానికి కృషి చేశారు. ఇటీవలే ఈ రోడ్డు నిర్మాణం పూర్తయింది. పాఠశాల వరకు రోడ్డు వేశారు. పాఠశాల ప్రాంగంణంలోనూ శుభ్రం చేశారు. దీంతో విద్యార్థుల సమస్య పరిష్కారమైంది. ఈ పాఠశాలలో మనబడి నాడు–నేడు ద్వారా గతంలోనే అన్ని వసతులూ కల్పించడం గమనార్హం.



మోడల్ స్కూల్‌కు కొత్తగా వేసిన సిమెంటు రోడ్డు

రోడ్డు బాగుంది



గతంలో పాఠశాల రహదారి అధ్వానంగా ఉంది. పాఠశాలకు వెళ్లాలంటే పెద్దరాళ్ళ మధ్య నడవాల్సి వచ్చేది. ఇటీవలే సీసీ రోడ్డు నిర్మించారు. ఇప్పుడు చాలా హాయిగా పాఠశాలకు వెళ్తున్నాం. మా పాఠశాలలో మనబడి నాడు–నేడు ద్వారా కల్పించిన వసతులూ బాగున్నాయి.

– షేక్ జాస్మీరా, 6వ తరగతి

గుంటూరు వెళ్లి పింఛన్ అందజేత

గుంటూరు మెడికల్/విజయపురిసౌత్: గుంటూరు లలితా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళకు మాచర్ల రూరల్ మండలం నాగార్జున సాగర్ సచివాలయ ఉద్యోగి వైఎస్సార్ పెన్షన్ శుక్రవారం అందించారు. పల్నాడు జిల్లా మాచర్ల రూరల్ మండలం నాగర్జున సాగర్ విజయపురి సౌత్ సచివాలయం పరిధిలోని ఏలే హనుమాయమ్మ గుండె జబ్బుతో ఫిబ్రవరి 26న చికిత్స నిమిత్తం వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా గుంటూరు లోని లలితా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో చేరింది. విషయం తెలుసుకున్న సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ నాగేశ్వరరావు గుంటూరు వెళ్లి ఏలే హనుమాయమ్మకు వైఎస్సార్ పెన్షన్ కానుక నగదును రూ.2,750 అందించారు.

డివిజన్‌లో ఏరియల్ సర్వే

ఆర్డీఓ అద్దెయ్య



గురజాల : రెవెన్యూ డివిజన్ పరిధిలోని గ్రామాల్లో ఏరియల్ సర్వే చేస్తున్నట్టు ఆర్డీఓ కె.అద్దెయ్య చెప్పారు. ఇప్పటికే డివిజన్‌లో 300 కిలోమీటర్లకుపైగా సర్వే జరిగిందన్నారు. రెండు రోజులుగా ఆకాశంలో విమానం చక్కర్లు కొడుతూ సర్వే చేస్తున్నట్టు వివరించారు. డివిజన్లోని 9 మండలాల్లో ఈ సర్వే జరుగుతుందని వెల్లడించారు.

భోజన పథకం తనిఖీ చేసిన న్యాయవాదుల సంఘం

శావల్యాపురం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ తీరును వినుకొండ బార్ అసోసియేషన్ సంఘం అధ్యక్షురాలు ఆరె.సామ్రాజ్యం శుక్రవారం పరిశీలించారు. భోజనం వికటించి విద్యార్థుల అస్వస్థతకు గురైన సంఘటనపై న్యాయమూర్తి తౌసిద్ హుస్సేన్ ఆదేశాల మేరకు మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును స్వయంగా పరిశీలించారు. మెనూ ప్రకారం అమలు జరగాలని, వంటకాల రుచి స్వయంగా పరిశీలించామని ఆమె వివరించారు. జరిగిన ఘటనపై సమగ్ర వివరాలు సేకరించామన్నారు. నివేదిక న్యాయమూర్తికి వివరిస్తామన్నారు. జిల్లా ఆహార భద్రత అధికారి సీహెచ్.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం అమలు తీరులో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని రుచికరమైన వంటలు వండించి ఆయా పాఠశాల్లోని ఉపాధ్యాయులు ఒకరు తిన్నా తదుపరి విద్యార్థులకు తినేలా పూర్తిస్థాయిలో బాధ్యత వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో మద్దికుంట సాంబశివరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాలాది శ్రీనివాసరావు, న్యాయవాదుల సంఘం నాయకులు పి.వి. రమణ రెడ్డి, చెన్నకేశవ రెడ్డి, నాగరాజు, రామాంజినేయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.



వంటకాల రుచిని పరిశీలిస్తున్న న్యాయవాదుల సంఘం అధ్యక్షురాలు సామ్రాజ్యం

గుర్తుతెలియని వ్యక్తి మృతి



రొంపిచర్ల: మండలంలోని అన్నవరం గ్రామంలో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. గ్రామ పరిధిలో గల పొలాలకు వెళ్లే వారు రోడ్డు ప్రక్కన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం రోడ్డు ప్రక్కన పడి ఉండటాన్ని చూసి గ్రామస్తులకు సమాచారం తెలియజేశారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు అధిక సంఖ్యలో అక్కడకు వెళ్లారు. అనంతరం సమాచారం తెలుసుకున్న ఎస్ఐ సిహెచ్ సురేష్‌బాబు ఆధ్వర్యంలో పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. గుర్తు తెలియని వ్యక్తి మృతదేహంగా నిర్ధారణ చేశారు. మృతి చెందిన వ్యక్తి సుమారు 50 సంవత్సరాల వయస్సు కలిగి యుండి, బ్లూ రంగు కలిగిన నిండు చేతుల చొక్కా, నలుపు రంగు లుంగీ మీద బ్లూకలర్ చుక్కలు, పూలు ఉన్నాయి. మృతదేహానికి సంబంధించిన ఎవరైనా ఉంటే రొంపిచర్ల పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని (9440796247) కి కాల్ చేయవచ్చునని ఎస్ఐ సీహెచ్ సురేష్‌బాబు తెలిపారు.

గాయపడి.. కడతేరాడు!

యడ్లపాడు: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఇద్దరు వ్యక్తుల్లో ఒకరు చనిపోయినట్లు యడ్లపాడు ఎస్ఐ పైడి రాంబాబు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం... చిలకలూరిపేట పట్టణంలోని మారుతీనగర్ ఎరుకల కాలనీలో నివాసం ఉంటూ కళామందిర్ సెంటర్‌లోని ఓ చికెన్ షాపులో గుమస్తాగా పనిచేస్తున్న దాసరి వెంకటేశ్వర్లు (32) అతని స్నేహితుడు శ్రీనివాసరావుతో కలిసి గతనెల 23న తెల్లవారుజామున బైక్‌పై గుంటూరు బయలుదేరారు. యడ్లపాడు నక్కవాగు సమీపంలోకి రాగానే బైక్ అదుపుతప్పి హైవే డివైడర్‌ను ఢీకొనడంతో బైక్‌తో సహా రోడ్డుపై పడిపోయారు. తీవ్రగాయాలైన వీరిని 108 వాహన సిబ్బంది గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం దాసరి వెంకటేశ్వర్లు మృతి చెందాడు. అతని భార్య విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం అనంతరం శుక్రవారం మృతదేహాన్ని అతని కుటుంబ సభ్యులు అప్పగించారు. మృతుడికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

టెన్త్ విద్యార్థులకు ఉచితంగా పోషకాహారం

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు సాయంత్రం సమయంలో ఉచితంగా పోషకాహారాన్ని అందిస్తున్నట్లు పాఠశాల పేరెంట్ కమిటీ చైర్మన్ పల్లపాటి శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో దాతలు, యువకులు విద్యార్థుల తల్లిదండ్రుల సహకారంతో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు పూర్తయ్యే వరకు ఉచిత పోషకాహార పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. పాఠశాల అభివృద్ధిలో వివేకానంద పూర్వ విద్యార్థుల కమిటీ సహకారం అభినందనీయమన్నారు.

వైభవం.. ప్రతిష్ఠా మహోత్సవం



రెడ్డినగర్‌లో నూతనంగా నిర్మించిన వరసిద్ధి వినాయక స్వామి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున ప్రతిష్ఠా కార్యక్రమంలో పాల్గొన్నారు. వినాయకుడితో పాటు ధ్వజస్తంభం, నవగ్రహ మండపం, విమాన శిఖర ప్రతిష్ఠా కార్యక్రమాన్ని ఆకళంకం వెంకట రామకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా జరిపారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, డాక్టర్ సుస్మితారెడ్డి దంపతులు ప్రతిష్ఠా మహోత్సవంలో పాల్గొన్నారు. మహిళలు ధ్వజస్తంభం వద్ద పూజలు నిర్వహించి వరసిద్ధి వినాయకుని దర్శించుకున్నారు. పూర్ణాహుతి నిర్వహించారు.

–నరసరావుపేట రూరల్

బైక్ చక్రాలు మాయం...!

బైక్ చోరీలు జరగడం సర్వ సాధారణం. కానీ ఇంటి ముందు ఉంచిన రెండు బైక్‌ల చక్రాలను గుర్తు తెలియని దుండగులు ఊడదీసుకెళ్లిన ఘటన మండల కేంద్రమైన యడ్లపాడులో జరిగింది. ఎస్‌బీఐ సమీపంలో నివసించే పోపూరి రాము గురువారం రాత్రి తన ఇంటిముందు బైక్‌ను ఉంచి శుక్రవారం ఉదయం లేచి చూడగా వెనక చక్రం కనిపించలేదు. అదేరోజు రాత్రి గ్రామంలోని హైవే సర్వీసు మార్గంలోని బైక్ మెకానిక్ షేక్ కరిముల్లా రిపేరుకు వచ్చిన బైక్‌లకు ఐరన్ చైన్‌తో చుట్టి తాళం షెడ్డుమూసి ఇంటికెళ్లాడు. ఉదయం వచ్చి చూస్తే బయట ఉంచిన వాహనాల గొలుసు ఊడదీసి ఉంది. ఓ బైక్ వెనుక చక్రం కనిపించలేదు. దీంతో వీరిద్దరూ పోలీసులను ఆశ్రయించారు.

–యడ్లపాడు



బెస్ట్ ఆఫ్ లక్!



స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం 10వ తరగతి విద్యార్థినీ విద్యార్థులు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయినీ సింగంశెట్టి అన్నపూర్ణమ్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల పీఎంసీ చైర్మన్ ఒంగూరి ప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ పరీక్షలు సమీపిస్తున్న సమయంలో విద్యార్థులందరూ బాగా చదువుకొని పాఠశాలకు మంచి పేరు తేవాలని సూచించారు. 130 మంది విద్యార్థినీ విద్యార్థులకు పరీక్షా సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో గంగినేని వీరయ్య, టి.వెంకట నర్సయ్య, పూర్వవిద్యార్థుల సంఘం సభ్యులు గంగినేని రాఘవ, గోవిందయ్య, కుమార్, రమేష్, ఉపాధ్యాయులు అంజిరెడ్డి, సీహెచ్. సుభాష్, కిరణ్, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

– వినుకొండ(నూజెండ్ల)

ఆల్ ఆర్ హ్యాపీ....

స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం వికటించి అస్వస్థత గురైన విద్యార్థుల ఆరోగ్యం క్షేమంగా ఉందని రాష్ట్రీయ బాల సురక్ష యోజన అధికారి హనుమా కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చిన్నారులకు అందుతున్న వైద్య సేవలను స్వయంగా పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అస్వస్థత గురైన 15 మంది విద్యార్థులకు స్థానిక ఆరోగ్య కేంద్రంలో వైద్య ఆరోగ్య సిబ్బంది పర్యవేక్షణలో వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. మరో నలుగురు విద్యార్థులను వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించామన్నారు. తల్లిదండ్రులు ఆందోళన పడాల్సిన పనిలేదని, అందరు క్షేమంగా ఉన్నట్లు చెప్పారు.

–శావల్యాపురం



రాజశేఖర్‌రెడ్డికి నివాళి

దాచేపల్లి : శ్రీనగర్‌కు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు అళ్ల రాజశేఖర్‌రెడ్డి మృతదేహం వద్ద ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి నివాళులర్పించారు. రెండు రోజుల క్రితం రాజశేఖర్‌రెడ్డి కాణిపాకం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన విషయం తెలిసిందే. రాజశేఖర్‌రెడ్డి మృతదేహం వద్ద శుక్రవారం ఎమ్మెల్యే కాసు పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. రాజశేఖర్‌రెడ్డి తల్లిదండ్రులు, భార్య, కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించి ఓదార్చారు. పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం రాజశేఖర్‌రెడ్డి మృతదేహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు. నివాళులర్పించిన వారిలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి, ఎంపీపీ కటకం జయశ్రీ, జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్ రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, మాజీ సర్పంచ్‌లు బుర్రి విజయ్‌కుమార్ రెడ్డి, మందపాటి రమేష్‌రెడ్డి, పార్టీ మండల, పట్టణ కన్వీనర్లు కోట కృష్ణ, షేక్ సుభానీ, మాజీ చైర్మన్ మునగా పున్నారావు, వైస్ ఎంపీపీలు తండా అబ్దుల్‌సత్తార్, కందుల జాను, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



రాజశేఖర్‌రెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

రైతు సదస్సులు వినియోగించుకోవాలి

మాచర్ల రూరల్: రైతుల సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని, సద్వినియోగపరుచుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ వాణి కోరారు. శుక్రవారం మండలంలోని కంభంపాడు, రాయవరం గ్రామాలలో జరిగిన రైతు సదస్సుల్లో ఆమె మాట్లాడారు. ఆన్ రిజిస్టర్, తెల్ల కాగితంపై కొనుగోలు చేసిన పట్టా భూములకు సంబంధించి సాదా బైనామా కింద క్రమబద్ధీకరించి ప్రభుత్వం నుంచి ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయనున్నట్లు వివరించారు. భూ యజమానులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఆర్వోలు ఆరుముళ్ళ నాగేశ్వరరావు, కె.అనిల్ కుమార్, మహమ్మద్ హసన్, పంచాయతీ కార్యదర్శి బిట్టు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న డిప్యూటీ తహశీల్దార్ వాణి

గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలి

పిడుగురాళ్ల : కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని మాచర్ల బస్టాండ్ సెంటర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి తెలగపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇటీవల రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగిన వెంటనే గ్యాస్ ధరను రూ.50 పెంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బుంగా నాగేశ్వరరావు, దీకొండ వెంకటేశ్వర్లు, కె.నాగేశ్వరరెడ్డి, మజ్జిగ నరసింహారావు, ముప్పాళ్ల వెంకటేశ్వర్లు, దీకొండ రామారావు, బిక్షాలు, తాళ్లూరి నరసింహారావు, హరిహర వీర రాఘవులు తదితరులు పాల్గొన్నారు.



పిడుగురాళ్లలో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

ఘనంగా బాబా ఆలయ వార్షికోత్సవం

యడ్లపాడు: మండలంలోని కొత్తసాలన గ్రామంలో షిర్డీ సాయిబాబా మందిరం 15వ వార్షికోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కిలారు కుప్పుస్వామి, గ్రామస్తుల సహకారంతో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకులు నారాయణం లక్ష్మణాచార్యులు, రుత్వికులు పరుచూరి రామకృష్ణమాచార్యులు, బి. పార్థసారథి ఆధ్వర్యంలో బాబావారికి కాగడా హారతి, విశ్వక్సేన పుణ్యాహవచనం, వినాయక, దత్తాత్రేయ సమేత సాయిబాబా వారికి పంచామృత అభిషేకాలు, పట్టువస్త్రాలు, పలు రకాల పుష్పాలతో విశేష అలంకరణ చేశారు. అనంతరం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బాబా వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వార్షిక వేడుకలకు హాజరైన భక్తులకు అన్నదానం, పలు రకాల ప్రసాదాల పంపిణీ చేశారు. సాయంత్రం సంధ్యాహారతి, భజన సంకీర్తనలు ఏకహారతి, కుంభహారతులు కోలాహలంగా జరిగాయి. కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు సమీప ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

నీటికుంటల ఆవశ్యకతను రైతులు గుర్తించాలి

బొల్లాపల్లి : భూగర్భజలాల వృద్ధికి నీటికుంటలు ఎంతో ఉపయోగకరమని ఉపాధి హామీ ఏపీఓ జీఎస్ ఆంజనేయరాజు తెలిపారు. మండలంలో అధికంగా మెట్ట ప్రాంతం ఉన్న సాగునీరు ఇబ్బందులు తొలగాలంటే పొలాల్లో బోర్ల సమీపంలో రైతులు నీటికుంటల ఆవశ్యకతను గుర్తించాలని చెప్పారు. వీటి వలన భూగర్భజలాలు వృద్ధి చెందుతాయని సాగునీటికి ఇబ్బందులు ఉండవని అన్నారు. చిన్న, సన్నకారు రైతులను నీటి కుంటల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని తెలిపారు. ఐదు ఎకరాలలోపు రైతులు తమ పొలాల్లో ఫారంపాండ్స్ ఏర్పాటుకు ప్రభుత్వం రూ.50 వేలు నుంచి రూ. 1.50 లక్షల వరకు ఉచితంగా అందజేస్తుందన్నారు. రైతులు తమ పొలాల్లో 2 మీటర్ల లోతు, 5 మీటర్ల పొడవు, 5 మీటర్ల వెడల్పుతో లేదా 20 మీటర్ల వెడల్పు, 20 మీటర్ల పొడవుతో నీటి కుంటలు ఏర్పాటు చేసుకునే ఆవశ్యకతను ఉపాధి హామీ పథకంలో ప్రభుత్వం కల్పిస్తుందని రైతులు సద్వినియోపరచుకోవాలని ఏపీవో తెలిపారు.

చెల్లని చెక్కు కేసులో జైలు శిక్ష

నరసరావుపేట టౌన్: చెల్లని చెక్కు కేసులో ఆర్టీసీ డ్రైవర్‌కు ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె.అంజయ్య తీర్పు చెప్పారు. ఇస్లాంపేటకు చెందిన షేక్ పెద్ద సైదా వద్ద చిలకలూరిపేట ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్న పసుమర్తి ఖాలేషావలి 2016 సంవత్సరంలో రూ.2.50 లక్షలు అప్పుగా తీసుకుని చెల్లింపులో భాగంగా చెక్కు అందజేశాడు. ఖాతాలో నగదు లేక పోవటంతో బాధితుడు కోర్టును ఆశ్రయించాడు. నేరం రుజువు కావటంతో నిందితుడికి 6 నెలల జైలు శిక్షతో పాటు ఫిర్యాదుదారుడికి రూ.5 లక్షల రూపాయల పరిహారం అందజేయాలని న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు.

వేదపాఠశాల ఉపాధ్యాయుడికి పీహెచ్‌డీ

నరసరావుపేట రూరల్: కోటప్పకొండ వేద పాఠశాల సంస్కృత ఉపాధ్యాయుడు పోలూరి కృష్ణవాసుకీ శ్రీకాంత శర్మ తిరుపతి జాతీయ సంస్కృత విద్యాపీఠం నుంచి పీహెచ్‌డీ పట్టాను పొందారు. తిరుపతి విద్యాపీఠంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో వర్సిటీ వైస్‌చాన్సలర్ ఎన్.వేణుగోపాల్ స్వామి నుంచి పట్టాను అందుకున్నారు. ప్రమోద చంద్ర మిస్ర విరచిత శతక కావ్యానం సాహిత్యకం అధ్యయనం అనే అంశంపై శ్రీకాంత్‌శర్మ పట్టా పొందారు. పీహెచ్‌డీ సాధించిన శ్రీకాంత్‌శర్మను వేద పాఠశాల ప్రధానాచార్యులు మారుతీ వెంకట్రామ శర్మ, అధ్యాపకులు అభినందించారు.